క్లుప్తంగా

ఇన్‌చార్జి జెడ్సీగా శంకరరావు


హెచ్.శంకరరావు

పెందుర్తి: జీవీఎంసీ జోన్-8 ఇన్‌చార్జి జోనల్ కమిషనర్(జెడ్సీ)గా హెచ్.శంకరరావు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. వేపగుంటలోని జోన్-8 కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఇప్పటివరకు జెడ్సీగా విధులు నిర్వర్తించిన కె.హేమావతి వ్యక్తిగత కారణాలతో మూడు నెలలు సెలవు తీసుకున్నారు. రానున్న మూడు నెలల పాటు జెడ్సీగా శంకరరావు విధులు నిర్వహించనున్నారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: యుక్త వయసులో మత్తు పదార్థాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపారు. పెందుర్తి పాతూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు, మహిళల భద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ర్యాగింగ్ అనే విష సంస్కృతికి ప్రతి ఒక్కరూ చరమగీతం పాడాలని సూచించారు. విద్యార్థులు పరస్పర స్నేహభావంతో మెలగాలన్నారు. మత్తు పదార్థాల వలన జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. యుక్త వయసులో చిన్నచిన్న సరదాల కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థినులు, మహిళా సిబ్బంది ఎలాంటి వేధింపులకు గురైనా తక్షణమే ఉపాధ్యాయులకు, పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే అదితి గజపతి


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న అదితి గజపతి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆమె పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంను అధికారులు అందించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


శశికిరణ్‌కు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక దరి పెదగంట్యాడకు చెందిన వై.శశికిరణ్ రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరపున దాతకు పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసన్నలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ బాండ్ ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు


ఎంపికైన క్రీడాకారులతో సంస్కృతి గ్లోబల్ స్కూల్ యాజమాన్యం

పరవాడ: జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి ఎం.వినోద్‌బాబు ఆదేశాల మేరకు విశాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 క్రీడా పోటీలకు ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్లో రైఫిల్ షూటింగ్, వుషు పోటీలు నిర్వహించగా, ఫెన్సింగ్, ఘట్కా, కరాటే, కూరష్, జూడో ఎంపిక పోటీలు ఎంవీఎస్ జూనియర్ కళాశాలలో జరిపారు. సుమారు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు అండర్-19 ఉమ్మడి విశాఖ జిల్లా జట్టుగా రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడాపోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.వి.పుష్పలత పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు అవకాశం కల్పించిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, ఎంవీఎస్ జూనియర్ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎట్టకేలకు మోక్షం!

- పూర్తిగా శిథిలావస్థకు చేరిన వేపగుంట-పినగాడి రోడ్డు
- 7.25 కి.మీ. మేర వీఎంఆర్‌డీఏ సారథ్యంలో నిర్మాణం
- 4.25 కి.మీ.కు వీఎంఆర్‌డీఏ నిధులు, 3 కి.మీ.కు జీవీఎంసీ నిధులు
- జీవీఎంసీ పరిధిలో విస్తరణ కోసం మార్కింగ్ చేస్తున్న అధికారులు


గోతులమయంగా మారిన రోడ్డు


వేపగుంట వద్ద రోడ్డు కొలతలు తీస్తున్న జీవీఎంసీ అధికారులు


పినగాడి వద్ద అధ్వానంగా వేపగుంట-పినగాడి రహదారి

వేపగుంట-పినగాడి రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. మూడేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు పూర్తవ్వాల్సింది. గత ప్రభుత్వం వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.11 కోట్ల నిధులు కూడా విడుదల చేసింది. అప్పటి కాంట్రాక్టర్(ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో టీడీపీ ఎమ్మెల్యే) నిర్లక్ష్యం కారణంగా పనులు మొదలవలేదు. కావాలనే ఆయన పనుల్ని తాత్సారం చేశారన్న ఆరోపణలు అప్పట్లో బలంగా వినిపించాయి. ఆయనపై చర్యలు తీసుకునే లోపే ఎన్నికల నోటిఫికేషన్ రావడం, ప్రభుత్వం మారడంతో ఎటూ తేలలేదు. ప్రస్తుతం రోడ్డు వెడల్పును 60 అడుగులకు పరిమితం చేసి, పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

పెందుర్తి:

వేపగుంట-పినగాడి రహదారి మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికుల కష్టాలకు ముగింపు పలికే రోజులు సమీపించాయి. గత ప్రభుత్వంలో నిధులు మంజూరై కూడా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిలిచిన పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యే సూచనలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. గతంలో 150 అడుగుల వెడల్పున విస్తరించాలనుకున్న రోడ్డును ప్రస్తుతం 60 అడుగులకు పరిమితం చేశారు. ఈ రోడ్డు నిర్మాణ బాధ్యతల్ని వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీకి రెండు భాగాలుగా విభజించారు. వీరు వేర్వేరు సమయాల్లో రోడ్డు పూర్తికి ప్రతిపాదించడంతో.. ఇరువురూ ఒకేసారి రోడ్డు పనులు చేపట్టి, ముగించేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నిర్మాణం పూర్తయితే ఎంతో మేలు

నియోజకవర్గంలోని అత్యంత కీలకమైన రహదారుల్లో వేపగుంట-పినగాడి రహదారి ఒకటి. చోడవరం, సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి ప్రాంతాల నుంచి నగరానికి చేరుకోవాలంటే ఈ మార్గాన్నే ప్రజలు ఎంచుకుంటారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. అలాంటి రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. దీనిపై రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాజాగా కురిసిన వర్షాలతో ఈ రోడ్డుపై ప్రయాణం అంటే ప్రత్యక్ష నరకంగా మారింది. ఈ నేపథ్యంలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఎంతో మేలు జరుగుతుంది.


వేపగుంట కూడలి వద్ద రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ చేస్తున్న అధికారులు

వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ భాగస్వామ్యం

ఈ నేపథ్యంలో తొలి దశలో 60 అడుగుల వెడల్పున రహదారిని నిర్మించేందుకు వీఎంఆర్‌డీఏ ముందుకు వచ్చింది. 7.25 కిలో మీటర్ల పరిధి ఉన్న ఈ రహదారిలో 4.25 కి.మీ. రోడ్డు కోసం వీఎంఆర్‌డీఏ రూ.14.8 కోట్లు, మిగిలిన 3 కి.మీ. పరిధికి జీవీఎంసీ దాదాపు రూ.12.5 కోట్లు వెచ్చించనుంది. ఇప్పటికే విస్తరణ కోసం జీవీఎంసీ పరిధిలో కొలతలు పూర్తి చేసిన అధికారులు భూసేకరణ కోసం ఇళ్లు, దుకాణాలకు మార్కింగ్ చేశారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు, స్థలాలు కోల్పోతున్న వారికి పరిహారం విషయం తేలాల్సి ఉంది.

ప్రస్తుతానికి 60 అడుగులే..

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో తొలుత 150 అడుగుల వెడల్పున రోడ్డు విస్తరణకు ప్రతిపాదించారు. అంత భారీ రహదారి అయితే ఈ మార్గంలోని అనేక గ్రామాలు పూర్తిగా కనుమరుగవుతాయని ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రోడ్డు విస్తరణను 60 అడుగులకు కుదించి నిధుల కేటాయింపు చేశారు. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలోని వేపగుంట కూడలి నుంచి చింతలగ్రహారం రైల్వే వంతెన వరకు తొలిదశలో విస్తరణ కోసం మార్కింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. చింతలగ్రహారం వంతెన నుంచి పినగాడి కూడలి వరకు ఉన్న గ్రామీణ ప్రాంతం(ఆర్ అండ్ బీ పరిధి)లో మార్కింగ్ ప్రారంభం కాలేదు.

పరిహారంపై చిక్కుముడి

అయితే ప్రస్తుతం ఉన్న రోడ్డును 60 అడుగులు చేస్తున్న నేపథ్యంలో చింతలగ్రహారం, శ్రీరాంపురం, పినగాడి ప్రాంతాల్లో వందలాది నివాసాలు, దుకాణాలతో పాటు ప్రవేటు స్థలాలు కూడా విస్తరణలో కలిసిపోయే అవకాశం ఉంది. వీరికి పరిహారం ఎంత ఇస్తారన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇవి చాలా వరకు రోడ్డు స్థలం ఆక్రమణల్లో ఉన్నాయి కాబట్టి.. పరిహారం పరిగణనలోకి రాదని అధికారులు చెప్తున్నారు. ఏదేమైనా త్వరగా టెండర్ల ప్రక్రియ ముగించి, రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దసరా నాటికి పనులు ప్రారంభించాలని..



నేను ఎమ్మెల్యేగా గెలిచాక అత్యంత ప్రాధాన్యతగా ఈ రోడ్డు నిర్మాణాన్ని తీసుకున్నాను. 150 అడుగుల రోడ్డు విస్తరణ అయితే ప్రజలకు మేలు జరుగుతుందని భావించినా.. అభ్యంతరాలు రావడంతో ప్రస్తుతానికి 60 అడుగుల రోడ్డు వేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ రెండు విభాగాలు ఒకేసారి పనులు ప్రారంభించేలా చూడాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించాం. ఆయన సానుకూలంగా స్పందించి రెండు టెండర్లు ఒకేసారి పూర్తి చేసి, పనులు కూడా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏది ఏమైనా దసరా నాటికి పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కావాలని ఆశిస్తున్నా.

– పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యే

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ సీఐ సురేష్, చిత్రంలో ఎస్ఐ నరసింగరాజు


పాత గోశాల జంక్షన్ వద్ద వాహన తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ కె.సురేష్ అన్నారు. పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌లేని ప్రయాణం ప్రమాదకరం

సింహాచలం: ద్విచక్రవాహనదారులు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ సూరిబాబు తెలిపారు. సింహాచలంలోని గోశాల తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడుపుతున్న వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ సుమారు వందకు పైగా కేసుల్లో హెల్మెట్ లేకుండా వావానం నడపడం, సరైన డాక్యుమెంట్లు లేనివే ఎక్కువగా ఉన్నాయన్నారు. చాలా మంది డ్రైవింగ్‌లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్, డాక్యుమెంట్లు లేకుండా వాహనాలను నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సామాజిక భవన నిర్మాణానికి వినతి


కార్పొరేటర్ కన్నాకు మొరపెట్టుకుంటున్న డ్వాక్రా మహిళలు

సింహాచలం: 93వ వార్డు పరిధి ప్రహ్లాదపురంలో స్థానిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఎలాంటి సామాజిక భవనం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని డ్వాక్రా సంఘాల మహిళలు కార్పొరేటర్ రాపర్తి కన్నాకు నివేదించారు. వార్డులోని ప్రహ్లాదపురం-1, ప్రహ్లాదపురం-2 పరిధిలో 57 డ్వాక్రాసంఘాల మహిళలు గురువారం కార్పొరేటర్‌ని కలిసి తమ సమస్యని వివరించారు. ప్రత్యేక భవనం లేకపోవడంతో రోడ్లపైన, ఆలయాల దగ్గర సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోందని వాపోయారు. దీనిపై కార్పొరేటర్ కన్నా మాట్లాడుతూ ఎమ్మెల్యే పంచకర్ల దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కేజీబీవీని సందర్శించిన దేవానందరెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న కేజీబీవీల సొసైటీ కార్యదర్శి దేవానందరెడ్డి

సబ్బవరం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)ను కేజీబీవీల సొసైటీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి గురువారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం రుచి చూశారు. అనంతరం కొత్తగా నిర్మించిన ఒకేషనల్ ట్రేడ్ ఆఫ్ బ్యూటీ అండ్ వెల్‌నెస్ గదిని ప్రారంభించారు. వచ్చే పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు ఎలా సాధించాలో వివరించారు. విద్యాలయంలో నిర్వహిస్తున్న విజయపథం రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట కేజీబీవీ ప్రిన్సిపాల్ మృదుల, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

వివేకానందుని మార్గం అనుసరణీయం


విద్యార్థులతో మాట్లాడుతున్న మునుస్వామి, చిత్రంలో ప్రిన్సిపాల్ డా.చంద్రశేఖర్

పెందుర్తి: స్వామి వివేకానందుని జీవితం యువతకు ఆదర్శమని అఖిల భారత వివేకానంద యువ మహా మండలి జిల్లా సభ్యుడు మునుస్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'మానవ నిర్మాణ విద్య-పరిచయ సంగోష్టి'అనే కార్యక్రమం నిర్వహించి పలు అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మునుస్వామి మాట్లాడుతూ శీల నిర్మాణం, వ్యక్తిత్వ వికాసం తద్వారా జాతీయతా భావాన్ని పెంపొందించడం, మానసిక ఏకాగ్రత అంశాలపై చర్చించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, సంస్థ ప్రతినిధి వెంకట్రావు పాల్గొన్నారు.

ఉపాధి మస్టర్‌లో దిద్దుబాట్లు, కొలతల్లో తేడా

- రూ.14.77 కోట్ల ఉపాధి పనులకు మండల స్థాయి ప్రజా వేదికలో సామాజిక తనిఖీలు
- రూ.14 వేలు రికవరీకి ఆదేశం, పంచాయతీ రాజ్ పనుల్లో రికవరీకి సిఫార్సు


సామాజిక తనిఖీల ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ పూర్ణిమదేవి

సబ్బవరం: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల కొలతల్లో తేడాలు, మస్టర్లలో దిద్దుబాట్లపై డ్వామా పీడీ ఆర్.పూర్ణిమదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంతోపాటు పలు అభివృద్ధి పనులు, సామాజిక పింఛన్లు వంటి రూ.14.77 కోట్లకు సంబంధించిన ఆడిట్‌ను స్థానిక మండల పరిషత్ ఆవరణలో గురువారం నిర్వహించారు. 18వ విడత మండల స్థాయి సామాజిక తనిఖీల ప్రజావేదికలో భాగంగా ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పద్మజ, జిల్లా విజిలెన్స్ అధికారి రవీంద్ర ఆధ్వర్యంలో పలు గ్రామాల ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ తనిఖీలు చేపట్టారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల నందు రూ.14 వేలు రికవరీ చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. మస్టర్ షీట్లలో దిద్దుబాట్లు, కొలతల్లో తేడాలు మరోసారి జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన వర్క్‌లపై క్వాలిటీ ఎంక్వయిరీ వేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్ చేపట్టిన పలు వర్క్‌లలో రికవరీకి ఆదేశించారు.

ఎంపీపీ బోకం సూర్యకుమారి మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రాధాన్యతా క్రమంలో ప్రజలకు ఉపయోగపడేలా చేపట్టాలన్నారు. సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించడం ద్వారా అవినీతికి తావులేకుండా, పనుల్లో నాణ్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ మణికుమార్, స్టేట్ ఎస్టీ గౌరీశంకర్, ఎస్ఆర్పీ చిరంజీవి అప్పారావు, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవోలు వసంతకుమార్, శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధి పథకం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే జీవితాలు నాశనం


మాట్లాడుతున్న క్రైం విభాగం ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: తెలిసో తెలియకో నేరాల్లో భాగస్వాములు అయితే వారి జీవితాలు దాదాపు ముగిసిపోయినట్లేనని పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ డి.సూరిబాబు అన్నారు. నేరాలను అరికట్టేందుకు విద్యార్థి దశ నుంచే చొరవ తీసుకోవాలని సూచించారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఐటీఐలో పెందుర్తి క్రైం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో అనేక మంది మైనర్లు చోరీలు, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాల్లో పాలుపంచుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో నడుచుకుని అనుకున్నది సాధించేందుకు కృషి చేయాలన్నారు. పలు అంశాలపై విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించారు. ఐటీఐ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డులోని వెంకటాద్రినగర్, గోపాలకృష్ణనగర్ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించనున్న తారు రోడ్లకు కార్పొరేటర్ శానాపతి వసంత గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.50 లక్షల జీవీఎంసీ నిధులతో ఆయా రోడ్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. నాయకులు శానాపతి శంకర్రావు, అవగడ్డ అప్పలనాయుడు, కాలనీ అధ్యక్షులు గార సత్యనారాయణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం అందజేత

విశాఖ సిటీ : రోడ్డు ప్రమాదంలో మృతుని కుటుంబ సభ్యులకు, క్షతగాత్రులకు నగర పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా రూ.3 లక్షలు పరిహారం అందజేశారు. హిట్ అండ్ రన్‌లో అనకాపల్లి జిల్లా పిసినికాడ గ్రామానికి చెందిన ఎడ్ల హేమంత్‌కుమార్ ఇటీవల మృతి చెందాడు.

దీంతో అతని భార్య వరలక్ష్మికి రూ.2 లక్షలు అందజేశారు. అలాగే హిట్ అండ్ రన్‌లో కేసులో క్షతగాత్రులైన అనుపోజుల దుర్గారావు, నేబర్తి కనకారావులు ఒక్కొక్కరికీ రూ.50 వేలు చొప్పున ఇచ్చారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ఎవరైనా సహాయం కోసం రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రంలో గానీ టోల్‌ఫ్రీ నెంబర్ 7995095793 టోల్‌ఫ్రీ నెంబర్‌కు గానీ సంప్రదించాలని పోలీసులు సూచించారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన


పురుషోత్తపురం పాఠశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పెందుర్తి: ప్రభుత్వం తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఏపీటీఎఫ్ నిరసన వారంలో భాగంగా ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి, మెమో 57ను తక్షణమే అమలు చేయాలంటూ శుక్రవారం మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్‌ను ప్రకటించాలని శనివారం ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలన్న డిమాండ్‌తో పాత తాలూకా కేంద్రాల్లో ఆదివారం నిరసన తెలుపుతామన్నారు. యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలనే డిమాండ్లతో సోమ, మంగళవారాల్లో జిల్లా కేంద్రాల్లో నిరసనతో పాటు సీఎం, సీఎస్‌లకు వాట్సాప్, ఈ మెయిళ్ల ద్వారా వినతులు పంపించనున్నట్లు ఏపీటీఎఫ్ ప్రతినిధులు వెల్లడించారు.

మెరుగైన విద్యా బోధనకు కృషి


విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు

సబ్బవరం: మండలంలోని వంగలి, జాగరపుపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్ని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) గిడ్డి అప్పారావునాయుడు గురువారం సందర్శించారు. పాఠశాలలోని విద్యా ప్రమాణాలను, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. అసైన్‌మెంట్ పుస్తకాలను, టైంటేబుల్, డైరీలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వాహణను, వాటిలో విద్యార్థులకు వస్తున్న మార్కులపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈవోలు లక్ష్మణరావు, ఎంజే రవీంద్రబాబు ఉన్నారు.